
**నెలల పసికందును అపురూపంగా పట్టుకుని జాగ్రత్తగా రైలుదిగింది జయంతి. ముందురోజు రాత్రి రైలు ఎక్కినప్పటినుండీ ఏకధాటిగా ఏడుస్తూనే వుందనడానికి నిదర్శనంగా ఆమె కళ్లు ఎర్రగా వాచిఉన్నాయి. బరువైన సూట్‌కేసును కూలీచేత మోయించుకుంటూ బయటికి వచ్చి రిక్షా మాట్లాడుకుంది. పెళ్లయ్యాక కాపురానికి వెళ్లేటపుడు అందరూ ఇదే స్టేషనుకు వచ్చి సాగనంపారామెను.**



# తిరస్కారం

## వారం వారం కథాప్రభ

మళ్లీ ఇప్పుడు ... రెండేళ్ల తర్వాత ... పుట్టింటికి తిరిగి వస్తోంది. బహుశా శాశ్వతంగా!

జయంతి ఉలిక్కిపడింది ఆ ఆలోచనకి. శాశ్వతంగా వచ్చేస్తోందా తను?

ఆ రెండేళ్లూ తను గడిపిన జీవితం గుర్తురాగానే, నిలువెల్లా వణికిపోతూ ... ఒడిలోని పిల్లాడిని గట్టిగా గుండెలకు అదుముకుంది.

కాపురానికి వెళ్లేటపుడు ఎన్ని కలలతో వెళ్లింది! ఎన్నో రోజులు పట్టలేదు ఆ కలలు కన్నీళ్లవడానికి !

అతని మాటలు ... ఆ శాడిజం! రెండేళ్ల చిత్రహింస ... భగవంతుడా! పగవాళ్లకు కూడా వద్దు ! తల వెనక్కి వాల్చి కళ్లు గట్టిగా మూసుకుంది. గుండెల్లో దుఃఖం సముద్రంలా పొంగుతోంది. దాన్ని గొంతుకు అవతలే బంధించే ప్రయత్నంలో శరీరం సన్నగా వణుకుతోంది.

ఏం పాపం చేసిందని తనకీ శిక్ష? ఎందుకింతగా పరీక్షించాడు భగవంతుడు తనని ?' అసహాయంగా అనుకుంది జయంతి.

తనకు తెలిసి తానే పాపమూ చేయలేదు. ఏ తప్పూ చేయలేదు. సుందర్‌ని ప్రేమించడం తప్ప తనే పొరపాటూ చేయలేదు.

అవును. ప్రేమించింది. సుందర్‌ని ప్రేమించింది.

ఆ ఆలోచనే ఆమెకు చిత్రంగా తోస్తోంది. రెండేళ్ల క్రితం సుందర్‌ని తను ప్రే... మిం... చి... పెళ్లి చేసుకుంది!!

ఎలావుండేది తను ఆ రోజుల్లో ! అప్పటి తన రూపం కళ్ల ముందు మెదిలి జయంతి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

జలపాతంలా వుండేది. ఆమె ఎక్కడుంటే అక్కడ సందడి. ఇంట్లో ... ఆఫీస్‌లో ... జయంతి పేరు వింటే చాలు ఒక ఉత్సాహతరంగం ఎగసిపడేది !

అలాంటి తను ... మొట్టమొదటిసారి అతన్ని చూసినపుడే మూగబోవడం ఆమెకి గుర్తొచ్చింది.

ఆరోజు ... ఆఫీస్‌లో ఏదో పని చేసుకుంటూండగా బాస్ నుంచి పిలుపొచ్చింది. జయంతి లేచి ఆయన కాబిన్‌లోకి వెళ్లింది.

"కూర్చోమ్మా. హి ఈజ్ సుందర్." అంటూ అతన్ని పరిచయం చేశాడాయన. కాలుమీద కాలు వేసుకుని చాలా క్యాజువల్‌గా కూర్చున్న అతన్ని రెప్పపాటులో గమనిస్తూ విష్ చేసింది జయంతి.

"బెంగుళూర్ నుంచి వచ్చారు. మంచి తెలివి, అనుభవం వున్న ఇంజనీర్..." బాస్ పరిచయం చేసి వెళ్లిపోయాక జయంతి అతనితో చాలాసేపు మాట్లాడింది.

ఫ్యాక్టరీ అంతా చూపించింది. కొత్త టెక్నాలజీస్ గురించి చర్చించింది. ఆమె అందాన్నీ, ఉత్సాహాన్నీ, తెలివితేటలనీ అబ్బురంగా చూశాడు సుందర్. పెళ్లి ప్రస్తావన తెచ్చాడు.

ఆమెకేమీ అభ్యంతరం కనబడలేదు. గొప్ప ఇంజనీర్ .. అందగాడు. పెద్దవాళ్లతో మాట్లాడమని చెప్పింది.

మర్నాడే వచ్చాడు. నెల్లాళ్లలో పెళ్లయ్యింది. జయంతి ఉద్యోగం మానేసి అతనితో బెంగుళూర్ వెళ్లిపోయింది.

అదిగో ... అప్పట్నుంచే మొదలయిందీ నరకం !

కిరసనాయిల్ పోసి తగలపెట్టడాలూ ... వాతలు తేలేలా కొట్టడాలూ లేవు. చిన్న మాటలు ... చాలా చిన్న చిన్న మాటలు ఉపయోగించి హృదయాన్ని ఛిద్రం చేయడంలో సుందర్ సిద్ధహస్తుడు.

ఆమెకు అతనిమీద వెర్రి ప్రేమ వుండేది. తనని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని కాదు. తన మెడలో మంగళసూత్రం ముడివేసిన స్నేహితుడని. తాను సీత అయితే అతడు రాముడని. అవును. ఆ బంధం మీద అమితమైన గౌరవమూ, ఆ వ్యక్తి మీద అంతులేని ప్రేమా ఉండేవి ఆమెకి . బోలెడంత సున్నితత్వమూ, అంతకు మించిన సామర్థ్యమూ వుండేవి. అందరికీ తాము ఆదర్శంగా వుండాలన్న తపన వుండేది.

సుందర్‌కి వాటిల్లో ఒక్కటీ నచ్చలేదు. నచ్చలేదా ? మరి వాటిని చూసేగా పెళ్లి చేసుకున్నాడు? కాదు. నచ్చకపోవడం కాదు భరించలేకపోవడం!

పెళ్లికి ముందు ఆమెకి గొప్ప నమ్మకం వుండేది. తాను చాలా బాగా మాట్లాడగలనని. నమ్మకమేముంది? నిజం. కొన్ని వందలమంది ఒప్పుకున్న నిజం. కానీ సుందర్ ఒప్పుకోలేదు. ఆమె మాట్లాడటం మొదలుపెట్టిన మరుక్షణం అతని ఎగతాళి ప్రారంభమయ్యేది.

"నీ కసలు మాట్లాడటం రాదు. నీకు మనుషులతో కలవడం రాదు" అనేవాడు. దాదాపు పదినెలలు, మాట్లాడిన ప్రతిమాటకూ విమర్శలు ఎదుర్కొన్నాక, ఆమెకు నిజమేననిపించడం మొదలుపెట్టింది. నిజంగానే నాకు మాట్లాడటం రాదా ?" అనుకునేది.


".... ఏవండీ! ఇవాళ ప్రక్కింటావిడ ఏమందంటే " అంటూ ఆమె మొదలుపెట్టగానే సుందర్ కళ్లు విప్పార్చి చూసేవాడు.

"ఏమిటీ! ఆవిడ నీతో మాట్లాడిందా? నీకు మనుషులతో మాట్లాడటం కూడా వచ్చా ?" అనేవాడు.

ఉత్సాహమంతా నీరుకారిపోగా జయంతి తలవంచుని వెళ్లిపోయేది.

పక్కింటివాళ్లతో, ఎదురింటివాళ్లతో మాట్లాడటం నేరం! నేరం అంటే మళ్లీ ఆ నేరానికి పెద్ద పెద్ద శిక్షలేమీ ఉండవు. చాలా చిన్న చిన్న మాటలే గురిగా వచ్చి హృదయాన్ని గుచ్చుతాయి.

అతను వచ్చేసరికి పక్కింటావిడతో మాట్లాడుతూ కనిపిస్తే చాలు, ... ఏంటీ! .. ఆంటీతో కబుర్లెక్కువయ్యాయి ఈ మధ్య?" అంటాడు కళ్లలోనూ, వంకర నవ్వులోనూ బోలెడంత వ్యాఖ్యానం నింపి.



టి. శ్రీవల్లీ రాధిక

ఆ ఎగతాళి చూసినపుడు తనను తాను వరికేసుకోవాలనిపించేది జయంతికి. ఎందుకితను ఒక్కసారి కూడా తనవైపు ప్రేమగా చూడడు? తను ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్త ... తన సర్వస్వం అనుకున్న వ్యక్తి ... అనుక్షణం అపహాస్యం తప్ప మరేమీ కనిపించనీయడెందుకు కళ్లల్లో ?

ఎవరితోనూ చెప్పుకోలేదు జయంతి. చెప్తే అర్థం చేసుకోగలిగినంత పెద్ద సమస్యలు కావివి. అందుకే మౌనాన్ని ఆశ్రయించింది.

సంవత్సరం తర్వాత 'పోనీ ఉద్యోగం చేస్తే?' అన్న ఆలోచన వచ్చింది. అప్లికేషన్ పెడ్తుంటే సుందర్

వద్దనలేదు. ఎప్పటిలాగే ఎగతాళి చేశాడు. నువ్వు ఉద్యోగానికేం పనికొస్తావ్?" అన్నాడు.

ఉ... ద్యో... గా...నికి పని.. కి.. రా..దా ? తను ఉద్యోగానికి పనికిరాదా? జయంతికి పెద్దపెట్టున ఏడవాలనిపించింది.

కానీ కాల్ లెటర్ వచ్చినరోజు ఆమెలో మళ్లీ ఉత్సాహం నిండింది. ఇంటర్వ్యూ బ్రహ్మాండంగా చేసి ఇంటికొచ్చాక మొహంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది.


సుందర్ రాగానే ఆనందంగా ఎదురు వెళ్లింది.

"...ఏమిటంత ఆనందం ?" అన్నాడు సుందర్ నవ్వుతూ.

న...వ్వు .. తూ..నే.

ఎదుటివాళ్లని ఏడిపించేటంతటి గొప్ప నవ్వు... ఒక్క సుందర్‌కే వచ్చేమో బహుశా !

జయంతికి గొంతు పెగలలేదు. అయినా ఎలాగో చెప్పింది అన్ని కబుర్లూ.




అంతా విన్నాక సుందర్ అన్నాడు. "అపుడే ఉద్యోగం వచ్చినట్లు సంబరపడుతున్నావేమిటి? ఇంకా ఇంటర్వ్యూనే అయింది. ఇందిరాగాంధీలా ఫీలయిపోకు."

అదికూడా నవ్వుతూనే అన్నాడు సర... దా..గా.

నిజమే. సరదాగానే. ఒకటే ఊపిరిగా బ్రతికే మనిషి ఇరవైనాలుగ్గంటలూ ...జీవితాంతమూ .. సరదాగా మాట్లాడటం కంటే కావలసింది ఏముంది?

ఒక్కసారి.. ఒక్కసారి కూడా సీరియస్‌గా మాట్లాడకపోవడంలో సమస్య ఏముంది?

జయంతి వెక్కి వెక్కి ఏడ్చిందారోజున.

చివరికి తనే తెప్పరిల్లింది. ఏమిటిది? సుందర్ మాటలకి బాధపడడం ఏమిటి ? అనుకుని వెళ్లి అతన్ని పలకరించింది.

అతను నవ్వుతూ దగ్గరకి తీసుకున్నాడు. విజయగర్వం నిండిన ఆ నవ్వును విశ్లేషించే ప్రయత్నం చేయలేదు జయంతి.

ఆమె బలహీనతను మాత్రం అతను సరిగ్గా అర్థం చేసుకున్నాడు. తనను వదిలిపెట్టి ఉండలేని ఆమె ప్రేమను, అతను ఏ భర్తా ఉపయోగించుకోనంత గొప్పగా ఉపయోగించుకున్నాడు.

రోజురోజుకీ, గంట గంటకీ ఆమెని మాటలతో బలహీన పరిచాడు.

పెళ్లయిన ఇరవైనెలలకే జీవచ్ఛవంలా తయారయింది జయంతి. బిడ్డను చూసుకుని కూడా పెద్దగా ఆనందించలేదు.

"... ఏమిటీ ! నీకొక్కదానికే కొడుకున్నట్లు మురిసిపోతున్నావూ? .. " అంటాడేమో అన్న భయంతో ... కనీసం హాయిగా నవ్వలేదు.

ప్రతి సున్నితమైన భావాన్నీ గుండెకు అవతలే దాచేసుకోవడం నేర్చుకుంది.

చాలా రోజుల తర్వాత వచ్చిన తమ్ముడు ఆశ్చర్యంగా చూశాడు. "ఏంటక్కా ! ఇలా అయిపోయావు?" అన్నాడు.

మేనల్లుడిని ఎత్తుకుని ముద్దాడాడు. జోకులు వేశాడు. "అక్కా! నాకేం చేసిపెడ్తావు ?"అంటూ హడావిడి చేశాడు.

జయంతి హుషారు తెచ్చుకుని వంట చేసింది. లొట్టలు వేస్తూ తింటున్న తమ్ముడికి కొసరి కొసరి వడ్డిస్తూంటే ... సోఫాలో కూర్చున్న సుందర్ ఒక్క క్షణం తదేకంగా చూశాడు.

తర్వాత టీ.వీ. వైపు తల తిప్పుతూ, రిమోట్‌తో ఛానల్స్ అటూయిటూ మారుస్తూ చాలా సాధారణంగా అన్నాడు ... ఆమెకి మాత్రమే వినపడేలా.

"మీనాన్నని ఒక బస్తా బియ్యం పంపించమని చెప్పు ... మీ తమ్ముడు వచ్చినప్పుడల్లా!"

అతని పక్కనుంచీ వంటగదిలోకి వెళ్తున్న జయంతి నిర్విణ్ణురాలైంది.

అసంకల్పితంగా తమ్ముడి కోసం చూసింది. అతను అప్పటికే బయటికి వెళ్లిపోవడం గమనించి చిన్నగా నిట్టూర్చింది.

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎంత ఘోరం ! తన సొంత తమ్ముడికి తన చేత్తో ఒక ముద్ద అన్నం పెట్టే అవకాశం లేదా?

ఆరోజున ఆమెకి అర్థమైంది.

ప్రేమించడం' అంటే అందానికి ఆకర్షితులవడం కాదు. పిల్ల బాగుంది కదా! అని పెళ్లి చేసుకోవడం కాదు.

**ప్రేమ అనేది ఒక విశేషణం కాదు. ఒక లక్షణం కాదు.**

**ప్రేమంటే ... ఒక మనిషితో మనం ప్రవర్తించే పద్ధతి, మాట్లాడే తీరు., ఆ మనిషి అలవాట్లతో మన మనసును అనుసంధానం చేసుకోగల నేర్పు**

.. ఆ తర్వాత అక్కడ ఎందుకుండాలో జయంతికి అర్థం కాలేదు.

వ్యక్తిగా తన పట్ల గౌరవం లేదు. భార్యగా తనతో సామరస్యమైన మాటలూ .. సంప్రదింపులూ లేవు. అన్నిటికన్నా ముఖ్యంగా .. అన్నిటి కన్నా ముఖ్యంగా .. అతనికి తనమీద అణువంత ప్రేమ లేదు.

ఇంకెందుకిక్కడ వుండడం?

రోజంతా ఆలోచనలతో పిచ్చెక్కసాగింది జయంతికి. ఎందుకిలా చేస్తాడు సుందర్? ఎందుకు ? ఎందుకు? అన్న ప్రశ్న పదే పదే మనసులో కెరటంలా లేచింది.

ఒక్కసారి తల్లి దగ్గరకు వెళ్లి ఆవిడ ఒడిలో తలపెట్టుకుని బాధంతా దించుకోవాలనిపించింది. అవును అమ్మకి చెప్పుకుంటే కానీ ఈ బాధ తీరదు. జయంతి మనసు తీర్మానించింది.

సూట్‌కేస్ సర్దుకుని హైదరాబాద్ ప్రయాణమైంది.

సుందర్‌కి ఒక లెటర్ రాసిపెట్టి, పక్కింటావిడకి తాళం చెవులిచ్చి, రైలెక్కింది.

కానీ ఈ ప్రయాణపు గమ్యం ఏమిటి ? అమ్మ ఏమని చెప్తుంది ? తిరిగి సుందర్‌దగ్గరకి వెళ్లమంటుందా! వద్దంటుందా ?

జయంతి ఆలోచనలలోనుంచి తేరుకోక ముందే రిక్షా ఆగింది.

"అమ్మా ! జయంతక్క వచ్చిందే!" అన్న చెల్లెలి అరుపు వినిపించింది మొదట. ఆ వెంటనే పరంపరగా ప్రశ్నలు వినిపించాయి.

"ఒక్కదానివే వచ్చావేంటమ్మా ?"

"బావగారేరక్కా?"

"సుందర్ రాలేదామ్మా?"

ఎవరికీ సమాధానం చెప్పకుండా లోపలికి నడిచింది జయంతి.

"నాల్రోజులుందామని వచ్చానమ్మా, నేనొక్కదాన్నే" ' ఆమె మాటలు విని అందరూ సర్దుకున్నారు. సంబరపడుతూ పిల్లాడ్ని అందుకున్నారు.

రెండురోజులు ... మూడురోజులు... గడిచాయి. అందరూ ఆనందంగా వున్నారు. కూతురి సంసారాన్నీ, ఆమె భర్త గొప్పదనాన్నీ, వాళ్ల ప్రేమకు గుర్తుగా కనిపిస్తున్న పండంటి పిల్లాడినీ చూసి మురిసిపోతున్నారు.

కానీ జయంతికే .. జయంతికే బాధని ఎదుర్కోవడం చేతకావడం లేదు. వచ్చేటపుడు తల్లితో చెప్దామనుకుంటూ వచ్చింది కానీ ఇప్పుడు చెప్పేందుకు ఏమీ కనబడడంలేదు.

నా భర్త నన్ను ప్రేమించడం లేదమ్మా !' అని ఎలా చెప్పడం ?

జీవితం పరిసమాప్తి అయిపోయినట్లుగా వుందామెకి. ఎందుకు ? ఎలా? ఎవరికోసం? అనిపిస్తోంది.

అద్దంలో చూసుకుంటే తనకి తనే చాలా కొత్తగా కనిపిస్తోంది.

బరువుగా వాలిపోతున్న కళ్లను చూస్తుంటే ... సుందర్ పెదవుల స్పర్శ వాటిమీద మోపిన భారం గుర్తొస్తోంది.

నడుము దగ్గరి మెలికను చూస్తుంటే ... అతని నాలుక చేసిన నాట్యాలు గుర్తొస్తున్నాయి.

మట్టెల పాదాలు చూస్తుంటే అతని పట్ల ఆరాధనతో .. అలవికాని ఆనందంతో ... అవి ఎలా మెలితిరిగాయో గుర్తొస్తోంది.

"భగవంతుడా!" కుప్పలా కూలింది జయంతి.

అణువణువూ దోపిడీ అయిన భావన. తనకంటూ ఏమీ మిగలని భావన!

ఏంచేయగలదు తనింక? ఇంత ఘోరంగా మోసపోయాక, అన్నీ కోల్పోయి మిగలాక ఇంక తనేం చేయగలదిపుడు?

ఆ క్షణం తన రూపాన్ని చూస్తుంటే ఆమెకు ప్రాణం పోయినా తిరిగి సుందర్ దగ్గరకి వెళ్లొద్దనిపిస్తోంది. కానీ ఆ నిర్ణయం అర సెకనులో ఆరోవంతుసేపైనా నిలబడడంలేదు.

శరీరం కాదు .. కనీసం మనసు కూడా మిగలలేదు తనకి! అది ఇప్పటికీ సుందర్ మీద ప్రేమని చంపుకోలేకపోతోంది.

ఎందుకింత బలహీనమైపోయింది తను ? వెరపు అనేది తెలియని తన కళ్లు ఎందుకింత చంచలమైనాయి? మనుషుల అలికిడి వింటే చాలు, మనసెందుకిలా వణికిపోతోంది?

ఒక్క వ్యక్తి... ఒకే ఒక్క వ్యక్తి... అతను భర్త అయితే కావచ్చు గాక. అయితే మాత్రం? ఒక్క వ్యక్తి ప్రేమ దొరకనంత మాత్రాన తనింత బలహీనురాలై పోయిందెందుకు?

దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది జయంతి. తలెత్తి చూస్తే... టేబుల్‌మీద కృష్ణుడి బొమ్మ చిరునవ్వులు చిందించింది.

కృష్ణుడు ఎంత అదృష్టవంతుడు! ఎంత మంది ఎన్ని రకాలుగా ప్రేమను కురిపించారు అతని మీద! అందుకేనా అంత అందమైన నవ్వు అతని సొంతమయింది!

జయంతి నిట్టూర్పులో గుండె పగిలిన శబ్దం వినిపించింది.

మనస్ఫూర్తిగా ప్రేమించిన వ్యక్తి ఆ ప్రేమను అందుకోకుండా నిర్లక్ష్యం చేస్తే... అది నిజంగా చాలా పెద్ద దెబ్బ.

అప్పుడు ఆ బాధ ఇంకా దారుణంగా ఉంటుంది.

ప్రేమకు లొంగని మనుషులు ప్రపంచంలో ఉన్నారని తెలిస్తే మనుషులంటేనే భయం వేస్తుంది.


యుద్ధంలో గెలవలేక పోవడం వేరు. గెలిచాక ఓటమి మిగలడం వేరు.

తన ప్రేమను ఒక వ్యక్తి... ఎవరో ఎవరో కాదు... తన మెడలో మంగళసూత్రం కట్టిన వ్యక్తి గుర్తించలేక పోయాడంటే... అది - ఆ నిజం ఎవరినైనా నిర్వీర్యుల్ని చేస్తుంది.

తను నవ్వితే ఎదుటివారు నవ్వుతారనీ, తను చేయి చాస్తే ఎదుటి వారు అందుకుంటారనీ నమ్మకం లేకపోతే మనిషి బ్రతకడం దుర్భరమవుతుంది.

ప్రస్తుతం జయంతి ఆ షాక్‌లోనే ఉంది.

పిల్లాడు ఏడుస్తున్నా పట్టించుకోని నిర్లిప్తతలో మంచం పట్టీని ఆనుకుని కూర్చుండి పోయింది.




ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ప్రతి మనిషికీ 'ప్రేమ' మీద చాలా గౌరవం ఉంటుంది. అహంకారం, ద్వేషం, చిరాకు ఇలాంటివన్నీ చెడు లక్షణాలన్న విచక్షణ ఉంటుంది. ఆ బలహీనతలను దాటి, ప్రేమను మాత్రమే పంచి ఇవ్వగలిగితే ప్రపంచంలో ఎలాంటి వ్యక్తిని అయినా జయించగలమన్న నమ్మకం ఉంటుంది.

కాకపోతే కొందరు బలహీనతలని దాచుకోలేక... అహాన్ని వదులుకోలేక ... ఎదుటి మనిషిని ప్రేమించలేక అవస్థ పడుతూంటారు.

అది బాధే. సమస్యే.

కానీ... కానీ... ఆ బలహీనతలన్నిటినీ జయించి, తనను కూడా మరచి ఒక మనిషిని ప్రేమిస్తే అంత గొప్పగా ప్రేమించాక కూడా ఆ మనిషి నిర్లక్ష్యం చేస్తే...

చెల్లెలు పరుగెత్తుకుంటూ లోపలికొచ్చింది.

"అక్కా ! బాబు ఏడుస్తున్నాడు." అంటూ వాడిని తీసుకొచ్చి అందించింది. జయంతి చేతులు అలవాటుగా పిల్లాడిని ఒడిలోకి తీసుకున్నాయి. చీరను పక్కకి జరిపి వాడి నోటికి స్తన్యాన్ని అందించాయి.

"అక్కా! ఒక చిన్న ప్రశ్న!"

"రేపు కాలేజ్‌లో డిబేటింగ్ వుంది. 'జీవితంలో ప్రేమ... దాని ప్రాముఖ్యం' అని. ఏం మాట్లాడను?"

చాలా రోజుల తర్వాత జయంతికి నవ్వొచ్చింది

"నువ్వేమనుకుంటున్నావు?" అంది.

"ఏమో. ప్రేమ అనేది అంత ముఖ్య విషయంగా తోచదు నాకు. అది జీవితంలో ఒక భాగం కావచ్చు కానీ

ప్రేమే జీవితం కాదు కదా! దానికన్నా ముఖ్యమైనవి చాలా వున్నాయి. మంచి వ్యక్తిత్వం సమాజంలో గుర్తింపు...'

"కాదమ్మా." జయంతి ఖండించింది. "వాటన్నిటికన్నా మనిషికి ప్రేమే ముఖ్యం. గాలీ... నీరూ... ఆహారం ఎంత అవసరమో, అవతలి మనిషి ప్రేమ కూడా అంతే అవసరం మనిషికి.

ప్రేమను అందుకోవడం ప్రతి మనిషికీ కనీసపు హక్కు. దాన్ని తిరిగి అందించడం... అతని బాధ్యత. నీకు ఇంకొక పాయింట్ చెప్తాను విను. అప్పు తీర్చనివాడిని ఋణగ్రస్తుడనీ, సహాయాన్ని గుర్తించని వాడిని కృతఘ్నుడనీ అంటాం మనం. కానీ ప్రేమను గుర్తించని వాడిని? ప్రేమని గుర్తించని వాడిని ఏమీ అనం. అది ఇవతలి మనిషిని రోజురోజుకీ కృశింపచేసేంత రాక్షసమైన చర్య అయినా దానికి మనం ఏ శిక్షా విధించం.

"నిన్ను ప్రేమించని వాడిపట్ల నీ ప్రవర్తన ఎలా వుంటుందనేది నీకు సంబంధించిన విషయం. వాడిని క్షమిస్తావో! శిక్షిస్తావో! పట్టించుకోకుండా వదిలేస్తావో అది నీ ఇష్టం!"

కానీ నిన్ను ప్రేమించే వ్యక్తి విషయంలో మాత్రం నీకు ఛాయిస్ లేదు. ఆ మనిషి పట్ల నువ్వు కూడా ప్రేమ చూపి తీరాలి.

నవ్వుతూ నీ దగ్గరకి వచ్చిన మనిషిని చీదరింపుగా చూసే అధికారం నీకు లేదు.

ఒకవేళ... ఒకవేళ నువ్వలా ప్రవర్తిస్తే దానికి శిక్ష లేకపోవడం కంటే ఘోరం లేదు!"

"అక్కా!" చెల్లెలి కళ్లలో ఆశ్చర్యం గమనించి జయంతి నవ్వింది. నువ్వేదో అడిగితే నేనేదో చెప్తున్నాననుకుంటున్నావు కదూ! కాదమ్మా. నేను చెప్పేది జీవిత సత్యం. దాన్ని నువ్వెలా మాటల్లో పెట్టుకుంటావో నాకు తెలీదు కానీ ప్రేమ ప్రాముఖ్యాన్నీ, దాని ఉనికినీ ప్రతి మనిషీ గుర్తించాలి అని మాత్రం చెప్పు."

ఆ మాటలకు మెచ్చుకోవాలనిపించిందో, లేకపోతే తన పెదవులు ఆమె స్తనాన్ని వదిలి చాలాసేపైనా గుర్తించనందుకు అలిగాడో, ఒడిలోని పాపాయి తన చిట్టి చేతులతో తపతపా ఆమె గుండెల మీద కొట్టాడు. జయంతి తలతిప్పి తనవైపు చూడగానే బోసినోరు తెరిచి హాయిగా నవ్వాడు. రెండు కాళ్లూ ఆడిస్తూ, కేరింతలు కొడుతూ జయంతి మొహాన్ని అందుకోబోయాడు.

జయంతి కళ్లను సన్నటి నీటిపొర క్రమ్మింది.

నీకు తెలిసిన ఈ చిన్న విషయం... ప్రేమకి ప్రతిస్పందించే ఈ చాతుర్యం మీ నాన్నకి తెలిస్తే ఎంత బాగుండేదిరా! అనుకుంది.

ఆ భావంతో హృదయం వణికింది. ఒక్క క్షణమే! మరుక్షణం ఒక స్థిర నిర్ణయంతో అది శక్తిని పుంజుకుంది.

మన ప్రేమకు గుర్తింపు లేని చోట మనం ఉండకూడదు. ఎక్కడ మనస్సు ఎండిపోతుందో... అక్కడ... అదెంత గొప్ప స్థానమైనా సరే ఉండకూడదు.

ఆస్తి... అంతస్తూ... హోదా... సంఘంలో గౌరవం... ఇవన్నీ చాలా చిన్న విషయాలు. వాటిని సంపాదించుకోవడానికి ఒకటికాదు... వంద కాదు... లక్షల మార్గాలున్నాయి.

కానీ... ప్రేమ... ప్రేమ వీటన్నిటినీ మించిన అవసరం. ఒకసారి దాన్ని సమూలంగా కోల్పోతే మళ్లీ పొందలేం. అది ఆఖరి బొట్టు వరకూ ఆవిరయ్యేలా హృదయాన్ని తపింపజేస్తే ఇక అక్కడ మళ్లీ ప్రేమ ఊరదు.

అందుకే... ప్రేమకు ప్రతిస్పందన లేకపోతే మనసును బలహీన పరచుకోకూడదు. ప్రేమను ఉపసంహరించుకోవాలి. అక్కడి నుంచి మౌనంగా నిష్క్రమించాలి. మిగతా ప్రపంచం వైపు... దృష్టి సారించాలి. మరొకరిని ప్రేమించేందుకు ప్రయత్నించాలి!

ఆలోచనల్లో కొట్టుకు పోతున్న జయంతి కళ్లలోకే తదేకంగా చూస్తున్న చెల్లెలికి ఏమర్థమైందో!

"అక్కా! నువు ఇక బెంగుళూరు వెళ్లవు కదా!" అంది కళ్లు పెద్దవి చేస్తూ.

హాయిగా నవ్వింది జయంతి. చెల్లెలి భుజం చుట్టూ చేయి వేసి దగ్గరికి తీసుకుంటూ "అవునమ్మా! ఇక వెళ్లను!" అంది.

## పరువు



గోపీ: ఏంటండీ అంత దిగాలుగా ఉన్నారు?

గోవిందం: మా అమ్మాయికి కృష్ణదేవరాయలు, కాళిదాసు, అన్నమాచార్యులంటే ఇష్టమంట!

గోపీ: పెళ్లికాని పిల్ల ఇంత మందిని ప్రేమిస్తే నాపరువేంగానూ?

గోపి: ???

కలపర్తి సత్యం (ఏలూరు)

